నేడు జాబ్‌మేళా

విజయనగర్‌కాలనీ: హైదరాబాద్‌ జిల్లా ఉపాధి కల్పన కార్యాలయంలో నేడు జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ఉపాధి అధికారి ఎ.వందన గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. వరుణ్‌ మోటార్స్‌ సంస్థలోని 100 ఖాళీల భర్తీకి ఈ ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఎస్‌ఎస్సీ, ఇంటర్మీడియేట్‌, ఏదైనా డిగ్రీ విద్యార్హత కలిగి ఉండి 18 ఏళ్లు నిండిన అభ్యర్థులు అర్హులన్నారు. ఆసక్తి అర్హత గల అభ్యర్థులు ధ్రువీకరణ పత్రాలు, ఫొటోలతో శుక్రవారం ఉదయం 11గంటలకు విజయనగర్‌కాలనీలో ఉన్న హైదరాబాద్‌ జిల్లా ఉపాధి కల్పన కార్యాలయంలో నేరుగా హాజరు కావచ్చన్నారు. ఇతర వివరాలకు 83284 28933లో సంప్రదించవచ్చు.

మోదీ పథకాలతోనే బీజేపీకి ప్రజా ఆదరణ


వాసుదేవ్‌ను సత్కరిస్తున్న ముక్క కృష్ణా గుప్తా తదితరులు

అబిడ్స్‌: ప్రధాని నరేంద్రమోదీ ప్రభుత్వ పథకాలతోనే బీజేపీకి రాష్ట్రంలోనే కాక దేశ నలుమూలలా ప్రజా ఆదరణ లభిస్తుందని తెలంగాణ రాష్ట్ర బీజేపీ ఉపాధ్యక్షుడు వాసుదేవ్‌ పేర్కొన్నారు. బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నియమితులైన ఆయనను గురువారం కట్టెలమండిలోని బీజేపీ కార్యాలయంలో కిసాన్‌ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముక్క కృష్ణాగుప్తా, సీనియర్‌ బీజేపీ నాయకుడు దాసరి చంద్రశేఖర్‌ ఆధ్వర్యంలో సన్మానం చేశారు. ఈ సందర్భంగా వాసుదేవ్‌ మాట్లాడుతూ..ఎన్నికలు ఎప్పుడు వచ్చినా రాష్ట్రంలో బీజేపీదే అధికారమన్నారు.

ఉద్యోగుల సంక్షేమానికి టీఎన్జీఓస్‌ ప్రత్యేక కృషి



అబిడ్స్‌: ఉద్యోగుల సంక్షేమానికి టీఎన్జీఓస్‌ కేంద్ర సంఘం ప్రత్యేక కృషి చేస్తుందని ఆ సంఘం అధ్యక్షుడు మారం జగదీశ్వర్‌, ప్రధాన కార్యదర్శి డాక్టర్‌ ఎస్‌ఎం.ముజీబ్‌ హుస్సేనీ పేర్కొన్నారు. గురువారం విద్యాశాఖ హైదరాబాద్‌ విభాగంలో ఉద్యోగులకు పదోన్నతులు కల్పించేందుకు కృషి చేసిన మారం జగదీశ్వర్‌, ఎస్‌ఎం.ముజీబ్‌ హుస్సేనీని టీఎన్జీఓస్‌ యూనియన్‌ స్కూల్‌ ఎడ్యుకేషన్‌ హైదరాబాద్‌ జిల్లా అధ్యక్షుడు కేఆర్‌.రాజ్‌కుమార్‌, కార్యదర్శి ఎం.భాస్కర్‌ల ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..అన్ని ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగులకు పదోన్నతుల ప్రక్రియ వేగవంతంగా జరిపేందుకు ప్రభుత్వం కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో విక్రమ్‌కుమార్‌, కుర్రాడి శ్రీనివాస్‌, శంకర్‌, మురళి రాజు, అఫీజ్‌, ఆదినారాయణ, రాజేశ్వర్‌, రాజేందర్‌, దామోదర్‌ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీల్లో పాలిటెక్నిక్‌ విద్యార్థిని ప్రతిభ



విజయనగర్‌కాలనీ: ఎన్‌సీసీ క్రమశిక్షణకు మారు పేరు అని మాసబ్‌ట్యాంక్‌ ప్రభుత్వ పాలిటెక్నిక్‌ కళాశాల ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ కె.చంద్రశేఖర్‌ అన్నారు. ఆరోగ్యం, వైద్య, పౌష్టికాహార విభాగాల్లో జరిగిన జాతీయ పోటీల్లో తమ కళాశాలలో కంప్యూటర్‌ సైన్స్‌ ఇంజినీరింగ్‌లో డిప్లొమా 3వ సంవత్సరం చదువుతున్న అంజలి యాదవ్‌ ప్రతిభ కనబరిచినందునా ఆమెను గురువారం సత్కరించారు. ఎన్‌సీసీ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన, ఆరోగ్య, స్వచ్ఛభారత్‌, ప్రకృతి విపత్తులో సహాయం తదితర కార్యక్రమాలు స్ఫూర్తిదాయకమన్నారు. ఎన్‌సీసీ విభాగాధిపతి సి.కార్తీక్‌కుమార్‌తో పాటు కళాశాల ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

చాంద్రాయణగుట్ట: ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన చాంద్రాయణగుట్ట పోలీస్‌స్టేషన్‌ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం..బార్కాస్‌కు చెందిన అహ్మద్‌ బిన్‌ ఉమర్‌ బాతేహార్‌ (55) స్థానికంగానే ఉన్న ఖబరస్తాన్‌తో అనుసంధానంగా ఉన్న అలీ అబ్దుల్లా మసీద్‌లో కార్మికుడిగా కొనసాగుతున్నాడు. మసీద్‌లోని ఐరన్‌ రాడ్‌కు అహ్మద్‌ నమాజ్‌కు పరుచుకునే వస్త్రంతో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మధ్యాహ్నం 3 గంటల సమయంలో గమనించిన మసీద్‌ నిర్వాహకులు కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చారు. అతని సోదరుడు మహ్మద్‌ మీర్‌ బాతేహార్‌ వచ్చేసరికి కింద పడుకోబెట్టారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

దంచికొట్టిన వాన

పాతబస్తీలో బుధవారం రాత్రి, గురువారం సాయంత్రం కురిసిన భారీ వర్షానికి లోతట్టు ప్రాంతాలు, రహదారులు జలమయమయ్యాయి. దీంతో ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. భారీగా వరద నీరు పారడంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. పాఠశాలలు, ఉద్యోగాల నుంచి ఇళ్లకు చేరుకునే విద్యార్థులు, ఉద్యోగులు ఆటోల్లో ముందుకు కదలలేక ఎదురుచూపుల్లో గడపాల్సి వచ్చింది. పలు ప్రాంతాల్లో చెట్లు నేలకూలాయి. లోతట్టు ప్రాంతాల్లో ఎక్కడ చూసినా వరద నీరే నిలిచిపోయింది. సంబంధిత అధికారులు, డీఆర్‌ఎఫ్‌ బృందాలు సహాయక చర్యలు చేపట్టారు. – చార్మినార్‌, అబిడ్స్‌, మెహిదీపట్నం జోన్ల బృందం


ఛత్రినాక చౌరస్తాలో ప్రవహిస్తున్న వరద నీరు


హనుమాన్‌నగర్‌లో...


సహాయక చర్యలు చేపడుతున్న సిబ్బంది


మల్లేపల్లి ప్రియా టాకీస్‌ వద్ద..


టోలిచౌకీ వద్ద వరదను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కౌసర్‌


తలాబ్‌కట్టాలో రోడ్డుపై నిలిచి వరద నీరు


సుల్తాన్‌షాహిలో విరిగిపడిన చెట్టు కొమ్మలను తొలగిస్తున్న డీఆర్‌ఎఫ్‌ బృందం


వరదనీటిలో విద్యార్థులతో పాటు తల్లిదండ్రులకు తప్పని తిప్పలు


హనుమాన్‌నగర్‌ వరదనీటిలో కొట్టుకొచ్చిన ద్విచక్ర వాహనం

'రాజ్యాంగాన్ని మార్చాలనుకుంటే మూల్యం తప్పదు'



అబిడ్స్‌: రాజ్యాంగాన్ని మార్చాలనే చూస్తే ప్రజాస్వామ్యవాదులే తగిన గుణపాఠం చెబుతారని రాష్ట్ర కార్మిక , ఉపాధి కల్పన శాఖ మంత్రి వివేక్‌ వెంకటస్వామి అన్నారు. రాజ్యాంగం మార్చాలని వ్యాఖ్యలు చేసిన కేసీఆర్‌ను ఇంటికి పంపారని, బీజేపీని 240 ఎంపీ సీట్లకు దించారని పేర్కొన్నారు. కన్ఫడరేషన్‌ ఆఫ్‌ ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మైనారిటీస్‌ ఆర్గనైజేషన్స్‌ రాష్ట్ర అధ్యక్షుడు మహేశ్వర్‌ రాజ్‌ ఆధ్వర్యంలో ఎగ్జిబిషన్‌ గ్రౌండ్స్‌ కాన్ఫరెన్స్‌ హాల్‌లో గురువారం జరిగిన 'గ్రామ, గ్రామాన రాజ్యాంగం' సభ సన్నాహక సమావేశంలో మంత్రి వివేక్‌ పాల్గొని మాట్లాడారు. పే బ్యాక్‌ టూ సొసైటీకి ప్రతి ఒక్కరు కట్టుబడి ఉండాలన్నారు. కొంత మంది రిజర్వేషన్ల ద్వారా ఐఏఎస్‌, ఐపీఎస్‌లుగా పైకి వచ్చాక, కింది వారికి సహాయం చేయడం మరిచిపోతున్నారని అన్నారు. దేశ ఆర్థిక వ్యవస్థ బలోపేతం కోసం ఆర్బీఐ స్థాపనలో అంబేద్కర్‌ పాత్ర కీలకమైందని అన్నారు. ఆయన తీసుకొచ్చిన ఆర్టికల్‌ 3 ద్వారానే తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందన్నారు. మన దేశానికి ఉన్న బలమైన రాజ్యాంగం ఏ దేశానికి లేదన్నారు. పాఠశాల విద్యలో రాజ్యాంగంపై ఒక చాప్టర్‌ పెట్టాలని, దీని ద్వారా విద్యార్థులలో రాజ్యాంగం పట్ల అవగాహన ఏర్పడి హక్కులు, బాధ్యతలు తెలుస్తాయన్నారు. ఈ విషయంపై ముఖ్యమంత్రితో మాట్లాడి పాఠ్య పుస్తకాల్లో రాజ్యాంగాన్ని చేర్చే ప్రయత్నం చేస్తామన్నారు.

53వ రామాయణ మేళా కమిటీల ఏర్పాటు


నూతన కమిటీలతో చీఫ్‌ కన్వీనర్‌ గోవింద్‌రాఠి

అబిడ్స్‌: ఎగ్జిబిషన్‌ గ్రౌండ్‌లో ఈ నెల 22 నుంచి అక్టోబర్‌ 2వ తేదీ వరకు నిర్వహించే 53వ రామాయణ మేళాకు సంబంధించిన కమిటీలను ఏర్పాటు చేశారు. ఎగ్జిబిషన్‌ గ్రౌండ్స్‌లో రామాయణ మేళా చీఫ్‌ కన్వీనర్‌ గోవింద్‌రాఠి నూతన కమిటీలను ప్రకటించారు. నూతన కమిటీలకు గిరిధర్‌లాల్‌ దాగ, కళావతి జాజు, రమేష్‌కుమార్‌ బంగ్‌, మనోజ్‌ జైస్వాల్‌, నందగోపాల్‌, సుమిత్‌రాఠి, రామ్‌దేవ్‌, లక్ష్మీనారాయణ రాఠి, ప్రేమలత, ప్రేమ్‌చంద్‌తో పాటు కొల్లూరి పవన్‌కుమార్‌, శకుంతల, గడ్డం రఘు, పవన్‌ మిశ్రతో పాటు పలువురు నేతలను నూతన కమిటీలకు కో ఆర్డినేటర్లుగా నియమించారు. ఈ సందర్భంగా గోవింద్‌రాఠి మాట్లాడుతూ..22 నుంచి అక్టోబర్‌ 2వ తేదీ వరకు రామాయణ మేళా వేడుకలు నిర్వహిస్తామన్నారు. దాండియా ఉత్సవాలు, రామాయణ వేడుకలు, రావణ దహనం, దసరా ఉత్సవాలను పెద్ద ఎత్తున చేపడుతామన్నారు. అక్టోబర్‌ 2న ఎగ్జిబిషన్‌ గ్రౌండ్‌లో వేలాది మంది భక్తులతో విజయదశమి ఉత్సవాలు నిర్వహిస్తామన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో పచ్చదనం, పరిశుభ్రత


సుభాష్‌చంద్రబోస్‌ కమ్యూనిటీ హాల్‌ ప్రాంగణంలో మొక్కలు నాటుతున్న దృశ్యం


సేవా పఖ్వాడా కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యదర్శి బద్దం మహిపాల్‌రెడ్డి

గోల్కొండ: బీజేపీ ఆదేశాల మేరకు ప్రధాని మోదీ జన్మదినం సందర్భంగా సేవా పక్షోత్సవం నిర్వహిస్తున్నామని గుడిమల్కాపూర్‌ డివిజన్‌ సేవా పక్షం కన్వీనర్‌ గోదా లక్ష్మీకాంత్‌ యాదవ్‌ అన్నారు. గురువారం ఆయన సుభాష్‌చంద్రబోస్‌ కమ్యూనిటీ హాల్‌ ప్రాంగణంలో స్వచ్ఛత కార్యక్రమాన్ని నిర్వహించారు. అదే విధంగా బీజేపీ డివిజన్‌ అధ్యక్షులు ఉద్దడి జగదీష్‌ ఆధ్వర్యంలో కమ్యూనిటీ హాల్‌ ప్రాంగణంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సేవా పక్ష గోల్కొండ జిల్లా కన్వీనర్‌ వెంకటేశ్‌, కో కన్వీనర్‌ మధుసూదన్‌, మనీష్‌, బోడి అన్ను యాదవ్‌ పాల్గొన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో..

గోల్కొండ: బీజేపీ నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాల్లో యువత ఉత్సాహంగా ముందుకొచ్చి తమ సేవాభావాన్ని చాటుకోవాలని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి బద్దం మహిపాల్‌రెడ్డి అన్నారు. గురువారం గుడిమల్కాపూర్‌ చౌరస్తా వద్ద బీజేపీ తలపెట్టిన సేవా పక్వాడా కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడతూ..ప్రధాని మోదీ 75వ జన్మదినాన్ని పురస్కరించుకొని ఆర్భాటాలకు పోకుండా బీజేపీ సమాజానికి ఉపయోగపడే సేవా కార్యక్రమాలు నిర్వహిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు దేవరశ్రీనివాస్‌, అశోక్‌ కుమార్‌యాదవ్‌, అన్ను యాదవ్‌, నామ యాదగిరి, జె.మధుసూదన్‌, లక్ష్మీకాంత్‌ యాదవ్‌ ఉన్నారు.

'అపెక్స్‌ బ్యాంక్‌'కు ఉత్తమ సహకార బ్యాంక్‌గా గుర్తింపు


అవార్డును అందుకుంటున్న అపెక్స్‌ బ్యాంక్‌ చైర్మన్‌ రవీందర్‌రావు

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర సహకార అపెక్స్‌ బ్యాంక్‌ 2024–25 సంవత్సరానికి గాను ఉత్తమ సహకార బ్యాంక్‌గా గుర్తింపు పొందింది. ఈ మేరకు గురువారం జాతీయ రాష్ట్ర సహకార బ్యాంక్‌ల సమైఖ్య ఆధ్వర్యంలో సహకార బ్యాంక్‌ల పనితీరును అంచనా వేసి వార్షికంగా అందజేసే యానువల్‌ ఫర్ఫామెన్స్‌ అవార్డును తెలంగాణ రాష్ట్ర సహకార బ్యాంక్‌ చైర్మన్‌ ఎం.రవీందర్‌రావు అందుకున్నారు. ఈ సందర్భంగా రవీందర్‌రావు మాట్లాడుతూ..ఈ అవార్డు రాష్ట్ర సహకార రంగానికి ఒక ప్రోత్సాహక చిహ్నంగా నిలిచిందని తద్వారా భవిష్యత్తులో ప్రజల భాగస్వామ్యం మరింత పెంచేందుకు కృషి చేస్తుందని తెలిపారు. పాలకవర్గ సభ్యులు కొత్తకురుమ సత్తయ్య, కుంభం శ్రీనివాస్‌రెడ్డి, యం.విష్ణువర్ధన్‌రెడ్డి, కె.రమేష్‌రెడ్డి, ఎ.భోజరెడ్డి, చిట్టి దేవేందర్‌రెడ్డి, ఎండీ వై.కె.రావ్‌ తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ


బాలకృష్ణ

సుల్తాన్‌బజార్‌: సుల్తాన్‌ బజార్‌ ట్రాఫిక్‌ ఇన్‌స్పెక్టర్‌గా జి.బాలకృష్ణ పదవి బాధ్యతలు చేపట్టారు. సుల్తాన్‌బజార్‌ ట్రాఫిక్‌ ఇన్‌స్పెక్టర్‌ ఉన్న రాంబాబు మెహిదీపట్నం డిటెక్టివ్‌ ఇన్‌స్పెక్టర్‌గా బదిలీ కావడంతో ఆయన స్థానంలో మెహిదీపట్నం డిటెక్టివ్‌ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేసిన బాలకృష్ణ సుల్తాన్‌బజార్‌ ట్రాఫిక్‌ పోలీస్‌ స్టేషన్‌ ఇన్‌స్పెక్టర్‌గా పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రజలు ట్రాఫిక్‌ రూల్స్‌ పాటించాలని సూచించారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవన్నారు.

ఫలక్‌నుమా ఇన్‌స్పెక్టర్‌గా సీతయ్య



చాంద్రాయణగుట్ట: ఫలక్‌నుమా పోలీస్‌స్టేషన్‌ ఇన్‌స్పెక్టర్‌గా ఎ.సీతయ్య పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇక్కడ పనిచేసిన ఆదిరెడ్డి దక్షిణ మండలం టాస్క్‌ఫోర్స్‌ ఇన్‌స్పెక్టర్‌గా బదిలీ కావడంతో ఆయన స్థానంలో 2004 బ్యాచ్‌కు చెందిన సీతయ్య బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..గతంలో ఫలక్‌నుమా ట్రాఫిక్‌, ఛత్రినాక పోలీస్‌స్టేషన్లలో ఎస్సైగా పనిచేసిన అనుభవం ఉందన్నారు. స్టేషన్‌ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని తెలిపారు.

పచ్చదనం పరిశుభ్రతతోనే సస్యశ్యామలం


మాట్లాడుతున్న సోమరాజ్‌ సింగ్‌, విద్యార్థులు

అబిడ్స్‌: పచ్చదనం, పరిశుభ్రతతోనే అన్ని ప్రాంతాలు, బస్తీలు, కాలనీలు సస్యశ్యామలంగా ఉంటాయని గోషామహల్‌ డివిజన్‌ బీజేపీ అధ్యక్షుడు సోమరాజ్‌ సింగ్‌ పేర్కొన్నారు. విద్యార్థులకు చిన్నప్పటి నుంచే పచ్చదనం పరిశుభ్రతపై అవగాహన కల్పించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. గురువారం ధూల్‌పేట్‌లోని షాహినాయత్‌గంజ్‌ పాఠశాల వద్ద సేవా పక్వాడ, పచ్చదనం పరిశుభ్రతపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సోమరాజ్‌సింగ్‌ మాట్లాడుతూ..విద్యార్థులు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకునే విధంగా కృషి చేయాలన్నారు. కేంద్రంలోని ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రభుత్వం విద్యారంగ వ్యాప్తికి ప్రత్యేక కృషి చేస్తుందని సోమరాజ్‌ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నరహరి, నవీన్‌ అగర్వాల్‌, దీపుసింగ్‌, రాము తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ ప్రభుత్వం దళిత, మైనార్టీల పక్షపాతి


ఇబ్రహీంబాగ్‌ హిందూ శ్మశాన వాటికలో పర్యటిస్తున్న వెంకటయ్య తదితరులు

గోల్కొండ: కాంగ్రెస్‌ ప్రభుత్వం దళితులు, బీసీ, మైనార్టీల పక్షపాతి అని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ సెల్‌ కమిషన్‌ చైర్మన్‌ టి.వెంకటయ్య అన్నారు. ఆయన గోల్కొండ ఇబ్రహీంబాగ్‌లో హిందూ శ్మశాన వాటిక పరిరక్షణ కమిటీ సభ్యులతో కలిసి శ్మశాన వాటిక స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..గత ప్రభుత్వం చేసిన తప్పిదాలను ఒక్కొక్కటిగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం సవరిస్తూ వస్తుందన్నారు. ఇబ్రహీంబాగ్‌ సర్వే నంబర్‌ 178లో 100 ఏళ్ల క్రితం నుంచి స్థానిక ముస్లింలు, దళితులు, బీసీలు దహన వాటికగా వాడుతున్నారన్నారు. అయితే గత ప్రభుత్వం ఈ మొత్తం స్థలాన్ని రాష్ట్ర పారిశ్రామిక అభివృద్ధి సంస్థకు కేటాయించిందన్నారు. శ్మశాన వాటిక పరిరక్షణ కమిటీ అధ్యక్షుడు సిరుగుమల్లే రాజు వస్తాద్‌, ఉపాధ్యక్షులు వినాయక దయానంద్‌, ప్రధాన కార్యదర్శి వి.ఎస్‌.రాజు, సురేందర్‌ పటేల్‌, రాకేశ్‌ పటేల్‌, పరుశురాం యాదవ్‌, ప్రశాంత్‌, వి.శ్రీనివాస్‌ తదితరులు ఉన్నారు.

పరిషత్తు ధర్మనిధి పురస్కారాల ప్రదానం


పురస్కారాలు అందుకుంటున్న ప్రముఖులు

సుల్తాన్‌బజార్‌: తెలుగు సాహిత్యంలోని వివిధ ప్రక్రియల్లో విశేష కృషి అందించిన తొమ్మిది మంది ప్రముఖులకు తెలంగాణ సారస్వత పరిషత్తు గురువారం డాక్టర్‌ దేవులపల్లి రామానుజరావు కళామందిరంలో జరిగిన ఉత్సవంలో ధర్మనిధి సాహితీ పురస్కారాలను ప్రదానం చేసింది. పరిషత్తు అధ్యక్షుడు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి సభకు అధ్యక్షత వహించారు. సాహితీవేత్తలు డాక్టర్‌ చింతపల్లి వసుంధారెడ్డి, ఆచార్య పి.సుమతీ నరేంద్ర, బీఎస్‌ రాములు, ఆచార్య రావికంటి వసునందన్‌, చిత్రకారులు డాక్టర్‌ పి.లక్ష్మీరెడ్డి, తెలుగు విశ్వవిద్యాలయం అసిస్టెంట్‌ డైరెక్టర్‌ రింగు రామ్మూర్తి అతిథులుగా పాల్గొన్నారు. డాక్టర్‌ రాయారావు సూర్యప్రకాష్‌రావుకు ఎర్రం రెడ్డి రంగనాయకమ్మ పురస్కారాన్ని, వేముగంటి మురళీకృష్ణకు ఆలూరి బైరాగి పురస్కారాన్ని, డాక్టర్‌ సంధ్యా విప్లవ్‌కు పాకాల యశోదారెడ్డి పురస్కారాన్ని, పింగిలి సుదర్శన్‌రెడ్డికి వానమామలై వరదాచార్యుల పురస్కారం, డాక్టర్‌ నగిలి సుధారాణికి చింతపల్లి వసుంధరారెడ్డి జానపద విజ్ఞాన పురస్కారం, డాక్టర్‌ తూర్పు మల్లారెడ్డికి బెజవాడ గోపాలరెడ్డి పురస్కారం, డాక్టర్‌ సాగి కమలాకర శర్మకు డాక్టర్‌ దివాకర్ల వెంకటావధాని పురస్కారం, కందుకూరి అంజయ్యకు డాక్టర్‌ రావికంటి వసునందన్‌ పురస్కారం, మ్యాకం రవికుమార్‌కు బి.ఎస్‌.రాములు యువ సాహితీ పురస్కారం ప్రదానం చేశారు.

తెలంగాణలో బీజేపీదే హవా


కేంద్ర మంత్రి గజేంద్రసింగ్‌ షెకావత్‌ను సన్మానిస్తున్న దేవర శ్రీనివాస్‌

గోల్కొండ: తెలంగాణ బీజేపీదే హవా అని కేంద్ర మంత్రి గజేంద్రసింగ్‌ షెకావత్‌ అన్నారు. బుధవారం నగరానికి వచ్చిన ఆయనను బీజేపీ కిసాన్‌ మోర్చా రాష్ట్ర నాయకుడు దేవర శ్రీనివాస్‌ కలిశారు. ఈ సందర్భంగా ఆయన కేంద్రమంత్రికి శాలువాతో ఘనంగా సత్కరించారు. తెలంగాణలో భారీ వర్షాలకు రైతులు ఆర్థికంగా పూర్తిగా నష్టపోయారని..నష్టపోయిన రైతులకు తెలంగాణ ప్రభుత్వం ఆదుకోవడంలో పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వం రైతుల కోసం ప్రవేశపెట్టిన పథకాలను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తమ పథకాలుగా ప్రచారం చేసుకుంటుందన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి


పనులు ప్రారంభిస్తున్న కార్పొరేటర్‌ భాగ్యలక్ష్మి

గౌలిపురా: ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నట్లు కార్పొరేటర్‌ ఆలే భాగ్యలక్ష్మి అన్నారు. గురువారం గౌలిపురా డివిజన్‌లోని దానయ్యనగర్‌ శారద పబ్లిక్‌ స్కూల్‌ వద్ద ఆమె రూ.6.50 లక్షలతో నూతన సీవరేజీ లైన్‌, సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..గౌలిపురా డివిజన్‌ను అన్ని విధాలుగా అభివృద్ధి పరిచేందుకు తనవంతు కృషి చేస్తున్నానన్నారు. ఈ కార్యక్రమంలో బస్తీవాసులు ఆనంద్‌, శ్రీనివాస్‌, గౌలిపురా డివిజన్‌ బీజేపీ అధ్యక్షుడు ఇ.సుమన్‌కుమార్‌ ముదిరాజ్‌, బీజేపీ జిల్లా మీడియా కార్యదర్శి జి.రఘుకాంత్‌, నాయకులు పి.రాజేశ్‌, కె.రాజ్‌కుమార్‌ ముదిరాజ్‌, జమాల్‌పూర్‌ అశోక్‌, సీహెచ్‌.నర్సింగ్‌, గౌలిపురా ఏఈ తేజోవంత్‌ పాల్గొన్నారు.

భారీ వర్షం..రాత్రంతా జాగారం

- నీట మునిగిన బస్తీలు
- ఇబ్బందులు పడిన స్థానికులు
- పట్టించుకోని అధికారులు




నీట మునిగిన అండాలమ్మ బస్తీ

నాంపల్లి: అండాలమ్మ బస్తీ, లక్ష్మీదాస్‌ బాడాలు బుధవారం రాత్రి కురిసిన వర్షానికినీట మునిగాయి. ఈ బస్తీలు మునగడానికి నాలాల దురాక్రమణే ప్రధాన కారణం. బుధవారం రాత్రి గంట పాటు కురిసిన వర్షానికి స్థానిక ప్రజలు రాత్రంతా జాగారం చేశారు. ఇండ్లలోకి మురికి నీరు వచ్చి చేరింది. ఇండ్లలోకి చేరుకున్న నీటిని ఎత్తి పోయడానికి తెల్లారింది. ఇంట్లోని బట్టలు, వస్తువులు, బియ్యం, ఉప్పు, పప్పు తడిచి ముద్దయ్యాయి. తడిసిన వాటిని సరిచేసుకునే లోపే మళ్లీ గురువారం సాయంత్రం వర్షం కురిసింది.

నాలా కబ్జాతోనే బస్తీ మునక..

పబ్లిక్‌గార్డెన్స్‌ నుంచి గాంధీభవన్‌కు వెళ్లే రూట్‌లో ఏషియన్‌ హోటల్‌, సుప్రభాత్‌ హోటల్‌ నాలా మీదనే నిర్మాణం చేపట్టారు. ఈ భవనాలకు అనుమతులు ఎవరిచ్చారో తెలియదు. రైల్వే స్టేషన్‌ నుంచి లక్ష్మీదాస్‌ బాడా, అండాలమ్మ బస్తీల మీదుగా వెళ్లే నాలా మీదనే నిర్మాణాలు చేపట్టారు. ఈ నిర్మాణాల కారణంగానే వరద నీళ్లు బయటకు వెళ్లే మార్గం లేకపోవడంతోనే బస్తీలు నీట మునుగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. వ్యాపారస్తులు యథేచ్ఛగా నాలాలను కబ్జా చేసి వరద నీరు వెళ్లకుండా అడ్డుకున్నా జీహెచ్‌ఎంసీ అధికారులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఎన్నాళ్లీ బాధలు..



రాత్రంతా జాగారం చేశాం. ఇంట్లోకి వచ్చిన నీటిని తోడి పోసుకోవడానికి తెల్లారింది. పిల్లలకు కంటి మీద కునుకు లేకుండా పోయింది. వర్షం వస్తే చాలు మాకు ఈ బాధ తప్పడం లేదు. ప్రభుత్వం బస్తీ మునగకుండా శాశ్వత పరిష్కారం చూపాలి. – వెంకటేష్‌, స్థానికుడు

నాలాల ఆక్రమణలతోనే బాధ..



రెడ్‌హిల్స్‌ నుంచి నాంపల్లి రైల్వే స్టేషన్‌ మీదుగా వచ్చే వరద నీటి నాలా లక్ష్మీదాస్‌ బాడా గుండానే ప్రవహిస్తుంది. ఈ నాలా గాంధీభవన్‌ మాలకుంట నాలాలో కలుస్తుంది. అయితే నాంపల్లి పబ్లిక్‌ గార్డెన్స్‌ రోడ్డు వద్ద ఏషియన్‌, సుప్రభాత్‌ హోటల్స్‌ వారు నాలాను కబ్జా చేసి నిర్మించారు. ప్రస్తుతం ఈ నాలా కనుమరుగైంది. నాలాను కబ్జా చేసిన హోటళ్లను కూల్చివేయాలి. – రామన్న, స్థానికుడు